MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments

Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణ దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

HAPPY Independence DAY

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

తెలంగాణ జిల్లాలు

శనివారం 04-04-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

## సాగులో 'మార్పు' రావాలి..

# పంట మార్పిడే ప్రాణాధారం!

### నేడే అగ్రికల్చర్ వర్సిటీలో కీలక సదస్సు

### రసాయనాల్ని తగ్గించి.. ఆరోగ్యాన్ని పండిద్దాం

### రైతుల సూచనలతో ప్రభుత్వానికి నివేదిక: వీసీ అల్దాస్ జానయ్య

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ )** వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించి లాభాలు గడించడమే కాదు.. సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడం కూడా అని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య స్పష్టం చేశారు. నేడు (శనివారం) విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న 'పంట మార్పిడి – ఆవశ్యకత' అనే కీలక సదస్సు వివరాలను ఆయన వెల్లడించారు. ప్రస్తుత సాగు విధానాల్లో విపరీతంగా పెరిగిపోయిన రసాయనాల వినియోగం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం అధిక దిగుబడి కోసం కాకుండా, పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. దీనికి 'పంట మార్పిడి' విధానం ఒక్కటే సరైన పరిష్కారమని, ఇది భూసారాన్ని పెంచడమే కాకుండా తెగుళ్ల బెడదను కూడా తగ్గిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం ఏసీ గదుల్లో కూర్చొని విధానాలు రూపొందించడం కాకుండా, ఎండనక వాననక కష్టపడే రైతుల అనుభవాలను ఈ సదస్సు వేదికగా సేకరించనున్నారు. అభ్యుదయ రైతులు, శాస్త్రవేత్తలు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల మధ్య జరిగే ఈ చర్చల సారాంశాన్ని విశ్లేషించి, పంట మార్పిడిని ఒక ఉద్యమంగా మార్చేందుకు అవసరమైన విధానాలపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు వీసీ తెలిపారు.



## రైతాంగ సమస్యలపై 6 న కలెక్టరేట్ ఎదుట ధర్నా

- మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలి
- యుద్ధాలతో రైతులపై తీవ్ర ప్రభావం
- 25 క్వింటాళ్ల నిబంధనలు ఎత్తివేయాలి తెలంగాణ రైతు సంఘం జిల్లా
- ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు
- త్వరలో యువరైతుల మెగా సమ్మేళనం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేష్

7లో




## రాజేంద్రనగర్‌లో ఘనంగా 'హిందూ సమ్మేళనం' హరిహర క్షేత్రం వేదికగా హిందూ బంధువుల ఐక్యత

**గండిపేట్ :. ( క్రైమ్ మిర్రర్ ):**: హిందూ సమాజాన్ని సుసంఘటితం చేసే లక్ష్యంతో శనివారం (ఏప్రిల్ 4) రాజేంద్రనగర్‌లోని హరిహర క్షేత్రంలో భారీ 'హిందూ సమ్మేళనం' నిర్వహిం చను న్నారు. సాయంత్రం 5:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రపంచ వాసవీ మహాపీఠాధీశ్వరులు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ శ్రీధర స్వామీజీ విచ్చేయనున్నారని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ 1925లో ప్రారంభమై, ఈ వంద సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ఎదురైన ఎత్తుపల్లాలను అధిగమిస్తూ, నేటి సామాజిక సవాళ్లను ఎదుర్కొనేందుకు హిందువులందరూ ఏకతాటిపైకి రావాలని ఈ కార్యక్రమాన్ని తలపెట్టారు. హిందూ సమాజం పట్ల గౌరవభావం, ఏకాత్మతా భావనను పెంపొందించడం, స్వధర్మం పట్ల అంకితభావం మరియు సేవాగుణాన్ని యువతలో వికసింపజేయడం ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశ్యం. మన దేశాన్ని తిరిగి 'విశ్వగురువు'గా నిలపాలనే సంకల్పంతో హిందూ బంధువులందరినీ ఈ వేదిక ద్వారా సమైక్యపరచ నున్నారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ వాసవీ మహాపీఠాధీశ్వరులు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ శ్రీధర స్వామీజీ ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారు. ముఖ్య వక్తగా ఎర్ర నర్సింగ్ పాల్గొని ప్రస్తుత పరిస్థితుల్లో హిందూ ఐక్యత ఆవశ్యకతను వివరిస్తారు. ప్రముఖ హైకోర్టు న్యాయవాది మౌనిక సుంకర మహిళా వక్తగా హాజరై ప్రసంగిస్తారు. ఈ సమ్మేళనానికి హిందూ బంధువులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

# తెలంగాణ ఉద్యమ జ్వాల దొడ్డి కొమరయ్య ..పాగర్తి సుధాకర్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ఉద్యమకారుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది ఈ సందర్భంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ ఆధిపత్యానికి, అహంకారానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా జరిగిన 'తెలంగాణ సాయుధ పోరాటం' మిగతా ప్రపంచ పోరాటాల కంటే భిన్నమైనది. చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ఈ స్ఫూర్తే నియంత పోకడలను నిలువరించడానికి అవసరమైన భావజాలాన్ని అందించింది. అన్యాయం శృతి మించితే ఆయుధాలను ఎత్తించి, ధిక్కార స్వరాలై నిలదీసేలా చేసింది. నిజాం నిరంకుశ పాలనకు, దొరల పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంతో ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకోవాలనుకున్న మిలిటరీ పాలనకు ఎదురొడ్డి 4000 మంది కార్యకర్తలు అమరులైనారని అన్నారు,ఆ కోవలో అమరుడై, తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరత్వాన్ని ఇచ్చి స్ఫూర్తినిచ్చినవారే దొడ్డి కొమురయ్య అని అన్నారు,భూ సమస్యలపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగే విధంగా చేసింది. తెలంగాణ ప్రజలను చైతన్య పరిచింది. బాంచెన్ దొరా నీ కాళ్లు మొక్కుతా అన్న బడుగు వారి చేత ఆయుధాలు పట్టించిం, అప్పటి నల్లగొండ జిల్లా జనగామ తాలూకాలోని విస్నూరు గ్రామంలో రాక్షతత్వానికి నిలువెత్తు నిదర్శనం అయినా విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి, అతని కొడుకు బాబుదొర వీరి ఆగడాలు అంతాఇంతా కాదనీ,60 గ్రామాలకు అధిపతి ఈ నరరూప రాక్షసుడు నిజాంకు తొత్తులుగా ఉన్న దొరలు, పటేళ్లు, పట్వారీలు గ్రామాల్లో ప్రజలపై చేయని అఘాయిత్యం లేదనీ ,విస్నూరు దగ్గరలో ఉన్న కడవెండి గ్రామాల రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ జాగీర్దార్ కడవెండి ఊరులో దొరసాని చేసిన ఆగడాలు తక్కువ ఏమి కాదనీ , చరిత్ర చెపుతుందని ,20 ఎకరాలు కూడా లేని జానమ్మ దొరసాని అనతికాలంలో ఊరును అంత తన గుప్పిట్లో పెట్టుకొని,జానమ్మ దొరసాని ప్రజల చేత దొర అని పిలిపించుకునేది. ఈ అణచివేత నుండి 1944 ఆంధ్ర మహాసభ ఏర్పాటు, తెలంగాణ ప్రాంతం అంతా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో సంఘాన్ని ఏర్పరుచుకొని ,సంఘం అండతో గ్రామాల్లో ప్రజలు వెట్టిచాకిరి రద్దు కోసం ఉద్యమబాట పట్టారనీ, పన్నులు కట్టేది లేదని తిరుగుబాటు చేశారనీ,ఇది చూసిన దొరలు ఉద్యమాన్ని అణచడం కోసం అనేక ప్రయత్నాలు చేసే వారు. దొడ్డి కొమురయ్య, అన్న దొడ్డి మల్లయ్య గ్రామంలో గొల్ల, కురుమల నాయకుడు. దొరసాని వెట్టికి గొర్రెలను ఇవ్వద్దని గొర్ల కాపర్లును చైతన్యపరిచాడు. దొడ్డి మల్లయ్యతో పాటు అదే గ్రామానికి చెందిన మంగలి కొండయ్య, నరసయ్య ఎర్రం రెడ్డి మోహన్ రెడ్డి, నల్ల నరసింహులు అప్పుడున్న సంఘంలో చేరి గ్రామ నాయకులు అయినారు. ఇది మింగుడుపడని జానమ్మ దొరసాని వీళ్లను హతమార్చాలని పన్నాగం పన్నింది. దొరసాని ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలు అంతా నిరసన ప్రదర్శన చేయాలని సంఘం నిర్ణయించింది. సాయుధ పోరాట వేగుచుక్క సంఘం పిలుపు అందుకొని కడవెండి గ్రామంలో ప్రజలు అంతా వీధుల గుండా ప్రదర్శన చేశారు. అప్పటికి దొరసానికి అండగా వచ్చిన విస్నూరు రామచంద్రారెడ్డి రౌడీలు కోడూరు దొర నరసింహారెడ్డి నాయకత్వం గడి నుండి ఎలాంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు జరిపారు. కడుపులోకి తూట దిగడంతో కొమురయ్య అక్కడికక్కడే నేలకొరిగాడు. కొమురయ్య అన్న మల్లయ్య కాలుకు తూట దూసుకుపోయింది. లక్ష్మీనరసయ్య కొండయ్యలకు గాయాలయ్యాయి. కొమురయ్య మరణం చుట్టు పక్కల గ్రామాల ప్రజల్లో ఆగ్రహాన్ని రగిల్చింది. వేలాది మంది ప్రజలు ఎక్కడికక్కడ సంఘం అండతో గ్రామాలలో దొర గూండాలను తరిమికొట్టారు. కొమురయ్య బలి దానం తెలంగాణ సాయుధ పోరాటానికి పురుడు పోసింది. సంఘం పిలుపుతో ప్రజలు సాయుధ మార్గం పట్టారు. కొన్ని ప్రాంతాలకు దేశ్‌ముఖ్‌లు ఉంటూ ప్రజలను రాచి రంపాన పెట్టినా దొరలను, వారి ఆధిపత్యాన్ని కూలదోశారనీ అన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు మండల నాయకులు పుట్టా సత్యనారాయణ,సయ్యద్ మోహినుద్దీన్, కళ్యాణం నాగేశ్వరరావు, బానోతు శ్రీనివాసరావు, మూడు రమేష్ తదితరులు పాల్గొనడం జరిగింది

# గ్యాస్ ఏజెన్సీల బ్లాక్ దందా

ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో ఏర్పడిన ఇంధన కొరతతో నగరంలో సిలిండర్‌లకు డిమాండ్ పెరిగిన విషయం తెలిసిందే. గ్యాస్ బుకింగ్ చేసి నెలరోజులు గడిచినా సిలిండర్ అందడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏజెన్సీలు వినియోగదారులకు అందాల్సిన సిలిండర్‌లను పక్కదారి పట్టిస్తున్నారు. అందులో భాగంగానే ఏజెన్సీలు కొన్ని బ్లాక్ దందా ముఠాను నియమించుకున్నాయి. ఎవరైతే ఇప్పటికే గ్యాస్ బుకింగ్ చేసుకున్నారో వారికి ఫోన్ చేసి ఓటీపీలు చెప్పాలంటూ అడుగుతున్నారు. సిలిండర్ వచ్చాక కదా ఓటీపీ చెబుతామంటే.. లేదు ఓటీపీ చెబితేనే సిలిండర్ వస్తుందని లేకపోతే క్యాన్సల్ అవుతుందని అనడంతో చాలా మంది ఓటీపీలు చెప్పేస్తున్నారు. దీంతో వారి సిలిండర్‌లను బ్లాక్ దందాకు తరలిస్తున్నారు. ఒక్కో సిలిండర్‌ను రూ. 3 వేల వరకు విక్రయిస్తున్నారు. వాణిజ్య సిలిండర్‌ను రూ.4-5వేల వరకు అమ్మేస్తున్నారు. ఒక్కో ఏజెన్సీ రోజుకు ఇలా సరాసరి 50-70 గ్యాస్ సిలిండర్‌లను పక్కదారి పట్టిస్తున్నారు. అంటే ఈ లెక్కన ఒక్క ఏజెన్సీ సుమారు రెండు లక్షల రూపాయలను బ్లాక్ మార్కెట్‌లో కొల్లగొడుతున్నది. వాణిజ్య సిలిండర్‌లతో కలిపి నెలకు సుమారు 50-70 లక్షల వరకు అక్రమంగా సంపాదిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలను పర్యవేక్షించాల్సిన ఏఎస్‌ఓలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఓవైపు కలెక్టర్ ఇంధన సరఫరా సరిపడా ఉందని చెబుతున్నా.. అందుకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో ఏజెన్సీలు వ్యవహరిస్తున్నాయి. డీఏపీ నెంబర్‌లు వచ్చినప్పటికీ బిల్లింగ్ ప్రక్రియ పూర్తైనా సిలిండర్‌లు వినియోగదారులకు ఇవ్వడం లేదు. అదేంటని అడిగితే సిలిండర్‌ల కొరత ఉందని చెబుతున్నారు. ఓ వినియోగదారుడు డబ్బులు చెల్లించి, డీఏపీ నంబర్ వచ్చినప్పటికీ సిలిండర్ ఎందుకు ఇవ్వరు అని అడిగితే "ఎక్కువ మాట్లాడితే సిలిండర్ కనెక్షన్ రద్దు చేస్తా' అంటూ ఏజెన్సీ సిబ్బంది బెదిరింపులకు దిగుతున్నారు.నగరంలో శుక్రవారం పలు ఏజెన్సీల్లో వినియోగదారులు తమకు సిలిండర్ బుకింగ్ నంబర్ వచ్చిందని, ఓటీపీ అడిగారని చెబుతూ వందల సంఖ్యలో ఏజెన్సీలను ఆశ్రయించడం పలు అనుమానాలకు తావిస్తోంది.



# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే.. పేదల సొంతింటి కల సాకారం


**-నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం**

**-ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**

**చౌటుప్పల్, ఏప్రిల్ 03, క్రైమ్ మిర్రర్ :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలో బోనకుర్తి సునీత-హరికృష్ణ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మా హాజరై ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో భాగంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో బోనకుర్తి సునీత-హరికృష్ణలు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకున్నారన్నారు. పేదల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, నిరుపేదల పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గ్రామంలోని ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పక్కీరు శ్రీనివాస్ రెడ్డి,వార్డు సభ్యులు ఊదరి శ్రీనువాస్, ఐతరాజు లింగస్వామి శారద, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ కొండల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లబోతు నారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉప సర్పంచ్ లు బత్తుల శ్రీహరి, కొంతం బుచ్చిరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఊదరి శంకర్, ఊదరి నర్సింహా, డాకొజీ సతీష్ వల్లబోతు నరేష్, సురేష్, జంగం సందీప్ బత్తుల వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చికుక్క స్వైర విహారం.. బాలుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటన

**కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామన్న అధికారులు**



నకిరేకల్, ఏప్రిల్ 3: నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ బాలుడిపై దాడి చేసి గాయపర్చిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారండ నకిరేకల్‌లోని శివాజీనగర్‌కు చెందిన గంట శంకర్ సరస్వతి దంపతుల కుమారుడు శరత్‌చంద్ర(4) పట్టణంలోని సాధన ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. శుక్రవారం సెలవుదినం కావడంతో ఉదయం 9 గంటలకు ఇంటి ఎదుట ఆడుకుంటుండగా పిచ్చికుక్క విచక్షణారహితంగా బాలుడిపై దాడి చేయడంతో అతడి ముఖంపై గాయాలయ్యాయి. బాలుడు కేకలు వేయడంతో తల్లిదండ్రులు వెంటనే నకిరేకల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్యుడు నీలోఫర్‌కు రెఫర్ చేయడంతో చికిత్స నిమిత్తం బాలుడిని హైదరాబాద్‌కు తరలించారు. ఇటీవల మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో పట్టణంలోని పిచ్చికుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టేందుకు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్, కమిషనర్ రంజిత్‌కుమార్ తెలిపారు. కోతులు, పిచ్చికుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

# ఖాకీ ఇంటికే "కన్నం"

శాంతిభద్రతల దుస్థితికి ఇదే నిదర్శనం!


యాచారం(క్రైమ్ మిర్రర్): యాచారం మండలం నందివనపర్తిలో, కానిస్టేబుల్ వెంకటేష్ ఇంట్లో జరిగిన దొంగతనం కేవలం ఒక నేర ఘటన మాత్రమే కాదు, అది నేటి శాంతిభద్రతల దుస్థితికి అద్దం పడుతున్న చేదు నిజం. ఓ శుభకార్యానికి వెళ్లిన రక్షకుడి ఇల్లు గుల్లయింది అంటే, నేరగాళ్లకు పోలీసులన్నా, చట్టాలన్నా ఎంతటి నిర్లక్ష్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. బీరువాలో దాచుకున్న 65 వేల నగదు, రెండున్నర తులాల బంగారం, 20 తులాల వెండిని దోచుకెళ్లిన దుండగులు, పరోక్షంగా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపారు. రాత్రింబవళ్లు సమాజ రక్షణ కోసం శ్రమించే ఒక పోలీస్ అధికారి ఇల్లే సురక్షితం కానప్పుడు, సామాన్య పౌరుడు తన ఇంట్లో ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితి ఉందా? అనే ప్రశ్న ఇప్పుడు ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. పోలీస్ శాఖ అధునాతన సాంకేతికతను వాడుతున్నామని, పెట్రోలింగ్ ముమ్మరం చేశామని చెబుతున్నా, ఇలాంటి ఘటనలు క్షేత్రస్థాయిలో వైఫల్యాలను ఎత్తిచూపుతున్నాయి. గస్తీ వ్యవస్థ కేవలం రోడ్లకే పరిమితమైందా? నివాస ప్రాంతాల్లో నిఘా నీడ గమ్యం ఎటు? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రక్షకుడి ఇల్లు దొంగల పాలవ్వడం అనేది, పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆత్మరక్షణలో పడాల్సిన విషయం. క్లూస్ టీమ్‌లు వచ్చి వేలిముద్రలు సేకరించడం, కేసు నమోదు చేయడం అనేది ఆనవాయితీగా మారుతుందే తప్ప, నేరాలు జరగకుండా నిరోధించడంలో గట్టి చర్యలు ఎందుకు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు..!? అధికారుల నిర్లక్ష్యం వీడాలి,



నిఘా పెరగాలని స్థానికులు అంటున్నారు.! ఈ ఘటన కేవలం ఒక దొంగతనం మాత్రమే కాదు, సామాన్యుడి భద్రతపై పోలీస్ శాఖకు విసిరిన సవాల్ లా మారింది..! ఇప్పటికైనా యంత్రాంగం చలించి, నేరగాళ్ల గుండెల్లో వణుకు పుట్టించేలా, కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాకీ ఇంట్లోనే కన్నం పడిందంటే ఇక సామాన్యుడి రక్షణ ఎవరి బాధ్యతని రోడ్డెక్కి అడిగే రోజులు దూరంలో లేవని మండల ప్రజలు అనుకొస్తున్నారు.. చూడాలి ఈ కేసులో పోలీసుల దూకుడు..

# పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడికి నిరసన

నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలి: ఏఐటీయూసీ నేత జైపాల్ రెడ్డి డిమాండ్



గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): విధి నిర్వహణలో ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలిపై అసభ్య పదజాలంతో దూషించి, భౌతిక దాడికి పాల్పడటం అత్యంత దారుణమని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మండిపడ్డారు. గురువారం ఉదయం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హసన్ నగర్ చౌరస్తాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పారిశుద్ధ్య కార్మికురాలు ఎన్. సత్యమ్మ (55) గురువారం తెల్లవారుజామున 5:30 గంటలకు విధులకు హాజరై, హసన్ నగర్ చౌరస్తాలోని గ్రాండ్ హోటల్ వద్ద పారిశుద్ధ్య పనులు చేస్తోంది. ఈ క్రమంలో హోటల్‌లో పనిచేసే వ్యక్తిని టీ అడగగా, అక్కడ ఉన్న ఒక గుర్తుతెలియని వ్యక్తి ఆమెపై అత్యంత నీచంగా బూతు పురాణం అందుకున్నాడు. "మీ ఇంట్లో ఆడవారిని ఇలాగే అంటారా?" అని బాధితురాలు ప్రశ్నించడంతో ఆగ్రహానికి గురైన సదరు వ్యక్తి ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. అక్కడ ఉన్న శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎస్ఎఫ్ఏ) అడ్డుకునే ప్రయత్నం చేయగా, నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన సత్యమ్మ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందారు. వైద్యులు దీనిని ఎమ్మెల్సీ (ఎం ఎల్ సి నెం: 10809) కేసుగా నమోదు చేశారు. అనంతరం బాధితురాలు బహదూర్‌పుర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలిని పరామర్శించిన జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కల్పించడంలో వైఫల్యం చెందితే అత్తాపూర్ సర్కిల్ వ్యాప్తంగా కార్మికులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.....

# ఇందిరమ్మ ఇంటి హామీ పత్రం అందజేత

మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్



చౌటుప్పల్,ఏప్రిల్ 03, క్రైమ్ మిర్రర్ : చౌటుప్పల మున్సిపల్ పరిధి తాళ్లసింగారం గ్రామంలోని రెండో వార్డు లో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో దోనకొండ రేణుకకు ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా శుక్రవారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ చేతుల మీదుగా ఇంద్రమ్మ ఇల్లు హామీ పత్రంను లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు దొనకొండ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్సీ సెల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఊదరి నరసింహ, మాజీ ఎంపీటీసీ మందారి మార్కు,మాజీ వార్డ్ మెంబర్ ఉడతల నరసింహ గౌడ్, దొనకొండ బాలయ్య, సర్పెల్లి మారయ్య, మారుపాక ప్రభాకర్ గౌడ్,దొనకొండ శంకర్,సుక్క నరసింహ,దొనకొండ పాపయ్య, దొనకొండ చంద్రు,గ్రామ పెద్దలు మాజీ ఉపసర్పంచ్ ఉదరి మారయ్య, దొనకొండ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



# బాబుల్ రెడ్డి నగర్ వీధిలోని ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలి కాలనీవాసుల సామూహిక విజ్ఞప్తి

గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రదేశానికి తరలించాలని కాలనీవాసులు అధికారులను కోరారు. ఈ మేరకు సంబంధిత ఎ. ఈ కి సామూహిక ఫిర్యాదు సమర్పించారు. నివాస ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా అనేక సమస్యలు ఎదురవుతున్నాయని ప్రజలు తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఆడుకోవడం వల్ల ప్రమాదాల భయం నెలకొన్నదని పేర్కొన్నారు. అలాగే కొన్ని సందర్భాల్లో స్పార్కింగ్ జరగడం, వర్షాకాలంలో నీరు చేరడం వల్ల ప్రమాదం మరింత పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్ నివాస ప్రాంతంలో ఉండటం భద్రతా పరంగా, ఆరోగ్య పరంగా ప్రమాదకరమని కాలనీవాసులు తెలిపారు. కాబట్టి, సంబంధిత అధికారులు ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే సురక్షిత ప్రదేశానికి మార్చి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు....

# బుద్వేల్‌లో 'ప్రజా పాలన' వైద్య శిబిరం విజయవంతం

250 మందికి పైగా రోగులకు ఉచిత పరీక్షలు

గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): రాష్ట్ర ప్రభుత్వం '99 రోజుల ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా, మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బుద్వేల్ సబ్ సెంటర్ వద్ద శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అసంక్రమ్య వ్యాధుల (ఎన్ సి డి) నిర్ధారణే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుండి భారీ స్పందన లభించింది. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మరియు మైలార్‌దేవ్‌పల్లి మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగింది. బుద్వేల్ సబ్ సెంటర్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఖాజీ మిస్బా అహ్మద్ ఆధ్వర్యంలో సుమారు 250 మందికి పైగా రోగులకు రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సెక్టార్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు మరియు ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి రోగులకు అవసరమైన సేవలు అందించారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం చేరువ చేయడమే లక్ష్యంగా ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మిస్బా అహ్మద్ తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు...



## గగన్‌పహాడ్‌లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా బైక్ ర్యాలీ, అన్నదానం నిర్వహణ





**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** గగన్‌పహాడ్ గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా భక్తుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ మరియు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో యువతతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులు గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా భక్తి నినాదాలతో బైక్ ర్యాలీ నిర్వహించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో అనేకమంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శీలం తిరుపతిరెడ్డి, సరికొండ వెంకటేష్, ఎర్రోళ్ల యాదయ్య, సురెడ్డి వినయ్ రెడ్డి, సూరెడ్డి సాయిరెడ్డి, సి.హెచ్. రాజు గౌడ్, శీలం సుధాకర్ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, శశిధర్ రెడ్డి, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

## మండుతున్న ఎండలు

**రంగారెడ్డి ఇబ్రహీంపట్నం క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** మండుతున్న ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 7 గంటల నుంచే సూర్యుడు తీవ్రంగా మండిపోవడంతో బయటకు రావడం కష్టంగా మారింది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు అవసరం లేకుండా బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యవసాయం చేసే రైతులు, చిన్నచిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పని చేయాలని సూచిస్తున్నారు. ఎక్కువగా నీరు, ద్రవ పదార్థాలు తీసుకోవడం, తలపై కప్పు ధరించడం, మధ్యాహ్న వేళల్లో బయట పనులను తగ్గించడం అవసరమని ఆరోగ్య నిపుణులు తెలిపారు. వైద్యులు హెచ్చరిస్తూ, ఎండ దెబ్బ (హీట్ స్ట్రోక్) నుంచి కాపాడుకోవాలంటే శరీరానికి తగిన ఆహారం, విశ్రాంతి అవసరమని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎండ ప్రభావం నుంచి తమను తాము రక్షించుకోవాలని సూచించారు.



# సిలువపై యేసు త్యాగం మానవత్వాన్ని మేల్కొలిపిన మహా సందేశం

### భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా సాగిన గుడ్ ఫ్రైడే సిలువ యాత్ర.!



**క్రైమ్ మిర్రర్ నేలకొండపల్లి (ఏప్రిల్ 03):** గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం నేలకొండపల్లి పట్టణంలోని ప్రధాన పురవీధులు భక్తి పరవశంతో మార్మోగాయి. యేసుక్రీస్తు శిలువ వేయబడిన దుఃఖ ఘట్టాన్ని స్మరించుకుంటూ క్రైస్తవ విశ్వాసులు ఉపవాసాన్ని ఆచరిస్తూ అత్యంత భక్తి శ్రద్ధలతో సిలువ యాత్ర నిర్వహించారు. ఉదయం 9.30 నిమిషములకు పాత బస్ స్టాండ్ వద్ద గల రోమన్ క్యాతలిక్ చర్చి నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమం, వీధి వీధి తిరుగుతూ సాగిన సిలువ యాత్రతో మరింత ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. యాత్రలో పాల్గొన్న క్రైస్తవుల చేతుల్లో సిలువలను మోసుకుంటూ, యేసుక్రీస్తు అనుభవించిన బాధలను స్మరించుకుంటూ ప్రార్థనలు చేశారు. ప్రతి దశలో "ప్రభూ, మమ్ము క్షమించు" అంటూ వినిపించిన ప్రార్థనలతో వాతావరణం భావోద్వేగభరితంగా మారింది. ఈ సిలువ యాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తమ భక్తిని చాటుకున్నారు. సిలువ యాత్ర సాగిన మార్గమంతా స్థానికులు సిలువకు నీళ్లు ఆరబోస్తూ తమ భక్తి శ్రద్ధలను చాటుకున్నారు.క్రీస్తు నేర్పిన ప్రేమ, క్షమ, సేవాభావం అందరు కలిగివుండాలి : ఫాదర్ స్టిలెన్ మారియో యేసు క్రీస్తు మానవాళి పాప విమోచన కోసం తన ప్రాణాలను సిలువపై అర్పించాడని ఫాదర్ స్టిలెన్ మారియో విశ్వాసులకు సందేశాన్ని అందించాడు. క్రీస్తు అనుభవించిన బాధలు, అవమానాలు అన్నీ ప్రేమతో సహించి చివరి శ్వాసవరకు క్షమాభావాన్ని చూపించాడని అలాంటి క్షమాబావాన్ని ప్రతి ఒక్కరు కలిగి జీవించాలని బోధించారు. ఒక పక్క తనను చంపివేస్తున్నారని తెలిసి కూడా వారిని క్షమించుము తండ్రి అనే ఆయన సిలువపై పలికిన మాటలు అపారమైన దయకు నిదర్శనమని బావోద్వేగబరిత ప్రసంగం చేశారు. సిలువపై చేసిన ఈ త్యాగం మానవత్వానికి ప్రేమ, క్షమ, సేవ అనే మహత్తర విలువలను నేర్పించిందని వెల్లడించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ జోసెఫ్, బ్రదర్ మరియకుమార్, ఉపదేశకులు సూరేపల్లి జ్ఞానరత్నం, పుష్ప, థామస్, ప్రసాద్, పుల్లారావు, నాగేశ్వరావు, బాలరాజు, మాజీ వార్డు సభ్యులు పగిడికత్తుల రాంబాబు, ఎస్సి సెల్ జిల్లా కన్వీనర్ జంగం లక్ష్మీ నారాయణ, మాల మహానాడు నాయకులు జంగం ప్రసాద్, యూనిటీ ఆఫ్ మాల జిల్లా కార్యదర్శి అవుట మధు, విచారణ సంఘ పెద్ద సిద్దెల వెంకటరత్నం, లక్ష్మి, ప్రసాద్, యువతి యువకులు విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చౌదరిగూడెంలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కాట సుధా



**పటాన్ చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 03:** గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడెం గ్రామంలో బొడ్రాయి మరియు గ్రామ దేవతల ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి పరవశంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా ముఖ్య అతిథిగా హాజరై దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆమె గ్రామ ప్రజలతో కలిసి కార్యక్రమంలో పాల్గొని, గ్రామ అభివృద్ధి, ఐక్యతకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. ఈ మహోత్సవంలో వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించగా, గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. గ్రామస్తులు భక్తి భావంతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలంగాణ గవర్నర్ ను కలిసిన ఎంపి డీకే అరుణ

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను శుక్రవారం మహబూబ్నగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఖేల్ సంసద్ మహోత్సవ్ ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను ఆహ్వానించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 9వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే క్రీడా మహోత్సవం గురించి గవర్నర్ కు వివరించినట్లు తెలిపారు. 24వ తేదీన మహబూబ్ నగర్ వేదికగా జరిగే ముగింపు వేడుకకు హాజరవుతానని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, సంసాద్ ఖేల్ కోఆర్డినేటర్ జనార్ధన్ రెడ్డి, మహబూబ్ నగర్ కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి నారాయణపేట ఇంచార్జ్ బాల్ రెడ్డి గవర్నర్ ను కలిసిన వారిలో ఉన్నారు.





## గుడ్ ఫ్రైడేను కొనియాడిన కథోలిక్ బిషప్

వేలాదిమందితో ఖమ్మం నగరంలో శాంతి ప్రదర్శన

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ఖమ్మం నగరంలో వేల మందితో శాంతి యాత్ర , ఏసుప్రభు బాధలు , శ్రమలు సిలువపై వేషధారణంగా ప్రదర్శించారు. పాత బస్టాండ్ ఏరియా నుండి జడ్పీ సెంటర్, ఎన్టీఆర్ సర్కిల్ ,కొత్త బస్టాండ్ మరియు కరుణగిరి వరకు ఈ ప్రదర్శన కొనసాగింది.ఏసుప్రభు చనిపోయిన సంఘటనలను జ్ఞాపకం చేసుకుంటూ కథోలిక్ చర్చి ఆధ్వర్యంలో ప్రముఖ ఫాదర్లు చే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి బిషప్ సగిలి ప్రకాష్ మాట్లాడారు. దైవ కుమారుడు అయినప్పటికీ మన వల్ల బాధింపబడి రక్షణ కోసం ప్రాణం అర్పించి, క్షమాపణ పంచి త్యాగము చేసిన వ్యక్తి ఏసుక్రీస్తు అని బడుగు,బలహీన కుటుంబాలకు వెలుగులు నింపి అందరికీ పరలోక దీవెనలు పంచిన దైవ కుమారుడు అని కొనియాడారు. ఈ మహా ప్రదర్శన కరుణగిరి వరకు 40 రోజులు దీక్ష తీసుకున్న వారితో కొనసాగింది. కరుణగిరి లో ప్రత్యేక ప్రార్థనలు చేసినారు.ప్రత్యేక ఆకర్షణగా యువకులచే ఏసు ప్రభు పాత్ర మేరీమాత వేషధారణ మరియు భక్తి ఉపన్యాసాలతో గేయలతో యాత్ర కొనసాగింది.ఈ కార్యక్రమంలో ఫాదర్ లు ఎస్ ఐజాక్ జ్ఞానేశ్ జయరాజు గోవా శౌరయ్య టి ఆంటోనీ జి సురేష్ ఏసు రాజు జోసెఫ్ రాజు మరియు సిస్టర్లు బ్రదర్ లు సంఘస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అమరవీరుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధనే లక్ష్యం

మణికొండలో ఘనంగా 99వ జయంతి వేడుకలు

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):**తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 99వ జయంతి వేడుకలను మణికొండ డివిజన్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ శ్రీ బీరప్ప మల్లన్న స్వామి సదనంలో జరిగిన ఈ కార్యక్రమానికి కురుమ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్ని దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం చైర్మన్ బి. జైహింద్ రావు మాట్లాడుతూ.. నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ప్రాణాలర్పించిన వీరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. ఆయన త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు సి. బీరప్ప, ప్రధాన కార్యదర్శి ఇ. వెంకటేశ్వర్లరావు, కోశాధికారి గణేష్, కమిటీ సభ్యులు ఇ. యాదయ్య, బి. శ్రీరాములు (పెద్ద), డి. బాబు, బి. ముత్యాలు, డి. లక్ష్మణ్, డి. కృష్ణ, బి. ఆంజనేయులు, బి. సదానంద, బి. దశరథ్, డి. కిట్టు, డి. మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# రెండు గంటల్లో దొంగతనం కేసు ఛేదించిన చౌటుప్పల్ పోలీసులు

- రోల్డ్ గోల్డ్ చైన్, నోకియా కీప్యాడ్ ఫోన్ స్వాధీనం...
- చౌటుప్పల్ సీఐ జి.మన్మధ కుమార్



**చౌటుప్పల్, ఏప్రిల్ 03, క్రైమ్ మిర్రర్ :** దొంగతనం జరిగిన రెండు గంటల వ్యవధిలోనే చైన్ స్నాచింగ్ నిందితులను పట్టుకున్న సంఘటన చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ మండల పరిధిలో జరిగింది. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... యాదాద్రి జిల్లా, చౌటుప్పల్ మండలం, దండు మల్కాపురం గ్రామంకు చెందిన సిద్దగొని నరసమ్మ(48) ఈనెల రెండో తారీఖు గురువారం సుమారుగా ఉదయం 8:30 గంటలకు తన అక్క అలివేలుతో కలిసి దండుమల్కాపురంలోని డబుల్ బెడ్ రూమ్ నుండి పని నిమిత్తం ధర్మకొల్ కంపనికి వెల్లుతుండగా మార్గ మధ్యలోని ధర్గ వద్ద వరకు వచ్చే సరికి అంతలో వారి వెనుకాలే వస్తున్న గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఒకేసారి ఫిర్యాదుదారులైన సిద్ద గొని నర్సమ్మ మెడలో ఉన్న రోల్డ్ గోల్డ్ ను బంగారం చైన్ అనుకోని బలవంతముగా బెదిరించి లాక్కొని అక్కడ నుండి పారిపోయినారు. వెంటనే బాధితురాలు చౌటుప్పల్ పోలీసు స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.కేసు నమోదు చేసిన వెంటనే యాదాద్రి-భువనగిరి ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఆదేశాల ప్రకారం, చౌటుప్పల్ డి.ఎస్.పి పి .మధుసూదన్ రెడ్డి సూచనాల ప్రకారం, చౌటుప్పల్ సీఐ జి.మన్మధకుమార్ ఆధ్వర్యంలో , యస్.ఐ కనకటి యాదగిరి, పోలీస్ సిబ్బంది మల్లాం సందీప్, ఎం .భారద్వాజ్, ఉదుగు సైదులు లతో కలిసి చాకచక్యంగా చైన్ స్నాచింగ్ దొంగలను దొంగతనం జరిగిన రెండు గంటలలోపే ఆందోల్ మైసమ్మ గుడి, మల్కాపురం గ్రామము దగ్గర నిందితులను చాకచక్యంగా పట్టుకోని పోలీసు స్టేషన్ కు తీసుకొని రావడం జరిగిందని సీఐ మన్మధ కుమార్ శుక్రవారం వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం, గాంధీనగర్ కాలనీకి చెందిన ఎండి సయ్యద్, (25), రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం,ఆదర్శ కాలనీకి చెందిన బోడ చరణ్ (18) లను నిందితులుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసి, గురువారం కోర్టులో హాజరు పరిచి జ్యూడిషియల్ రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుల వద్ద నుంచి సుమారు వెయ్యి రూపాయలు విలువగల రోల్డ్ గోల్డ్ చైన్, నోకియా కీప్యాడ్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగతనం జరిగిన రెండు గంటల లోపే నిందితులను పట్టుకున్న సీఐ జి మన్మధ కుమార్, ఎస్ఐ యాదగిరి, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, చౌటుప్పల్ డిఎస్పి పి. మధుసూదన్ రెడ్డి లు అభినందించారు.

# ఫీజు బకాయిలపై హైకోర్టు తీర్పు సరికాదు

- పేద విద్యార్థులు చదువులకు తీవ్ర నష్టం.
- ప్రభుత్వ హామీలతో కళాశాలలు విద్యార్థులను చేర్చుకున్నారు.
- ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు.
- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ.
- జిల్లా అధ్యక్ష కార్యదర్శులు - వి.రాజు టి.ప్రవీణ్









**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఫీజు బకాయిలపై ఇచ్చిన తీర్పులో విద్యార్థుల నుండి వసూళ్లు చేసుకోని ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తిరిగి విద్యార్థులకు చెల్లించాలని తీర్పు సరైనది కాదని ఇది విద్యార్థుల చదువుల అభివృద్ధికి గొడలిపెట్టని హైకోర్టు తీర్పును పునఃసమీక్ష చేయాలని ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ కోరుతుంది. ప్రైవేటు కళాశాలలు ప్రభుత్వం ప్రకటించిన ఫీజు పథకం అమలు చేస్తామని అంగీకారాన్ని తెలిపి విద్యార్థులను చేర్చుకున్నారని అలాంటిది ప్రైవేటు యాజమాన్యాల బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వకుండా విద్యార్థుల నుండి వసూళ్లు చేసుకోండి అనే తీర్పు సరైనది కాదు. అణగారిన వర్గాలు నుండి ఇప్పుడే ఉన్నత విద్యలోకి వస్తున్న ప్రధానంగా ఈ ఫీజులు పొందే వారు పేద విద్యార్థులు వారిలో రాష్ట్రంలో 14 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బి.సి. ,మైనారిటీ విద్యార్థులలే ఈ పథకం కింద లబ్ది పొందుతున్నారని వారిని ఈ తీర్పు వల్లన మరింత వేధింపులు గురి అవుతారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రైవేటు యాజమాన్యాలు ఫీజులు బకాయిలు రావడం లేదని పేద విద్యార్థుల సర్టిఫికేట్స్ ఇవ్వకుండా వేధింపులు గురి చేస్తున్నారని, దీని వల్ల గతంలో విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే రాష్ట్రంలో పెండింగ్ ఉన్న ఫీజు రీయంబర్స్, స్కాలర్ షిప్స్ విడుదల చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ కోరుతుంది. హైకోర్టు తీర్పును పునఃసమీక్ష చాలా చేయాలని, ప్రభుత్వానికి తక్షణమే ఫీజుల విడుదల కోసం ఆదేశాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది.

# బాటసారుల దాహార్తి తీర్చడం అభినందనీయం

మణికొండలో 'అరుణాచల శివ సేవ సత్సంగ్' ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** వేసవి తాపంతో అల్లాడిపోయే బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసే చలివేంద్రాలు మానవత్వానికి నిదర్శనమని పలువురు నేతలు కొనియాడారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్ర బ్యాంక్ సర్కిల్ వద్ద అరుణాచల శివ సేవ సత్సంగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శు క్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ రామకృష్ణ రెడ్డి, మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ ఉపశమనం కలిగించే ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎండలో అలసిపోయి వచ్చే వారికి చల్లటి నీరు అందించడం అత్యంత పుణ్యకార్యమని, సత్సంగ్ సభ్యుల సేవా దృక్పథాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్సంగ్ ప్రతినిధులు, నాయకులు మాల్యాద్రి నాయుడు, శ్రవణ్ కుమార్, వివిధ పార్టీల నాయకులు మరియు స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.



## తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా మంచిరెడ్డి విజయకిరణ్ రెడ్డి నియామకం



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, ఎలిమినేడు గ్రామానికి చెందిన మంచిరెడ్డి విజయకిరణ్ రెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ జాగృతిలో సీనియర్ నాయకుడిగా ఉన్న విజయకిరణ్ రెడ్డి, స్వతహాగా వ్యవసాయదారుడు కావడంతో పాటు పాడి పరిశ్రమపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే లక్ష్యంగా, వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ జాగృతి ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. నాడు తెలంగాణ ఉద్యమ సమయంలోనే కాకుండా, నేడు రైతుల శ్రేయస్సు మరియు సామాజిక మార్పు కోసం కవిత నాయకత్వంలో రైతు విభాగం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కవిత ఆశయాలకు అనుగుణంగా, రైతుల గొంతుకగా ఈ విభాగం పనిచేస్తుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నూతన అధ్యక్షుడు విజయకిరణ్ రెడ్డికి పాండురంగారెడ్డి సూచించారు. అవసరమైతే రైతుల పక్షాన ప్రభుత్వంపై పోరాడాలని, రైతు శ్రేయోభిలాషులను ఏకం చేస్తూ జాగృతి బలోపేతానికి విశేషంగా కృషి చేయాలని కోరారు. తమ ఈ నియామకం పట్ల నూతన అధ్యక్షుడు మంచిరెడ్డి విజయకిరణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, రైతుల పక్షాన నిలబడి సంస్థ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. నాకు ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి, రావడానికి సహకరించిన తోటి జాగృతి నాయకులకు ధన్యవాదాలుతెలిపారు.

మహేశ్వరం నియోజకవర్గం యంయల్ఏ క్యాంపు కార్యాలయమునకు విచ్చేసిన మాజీమంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావుని మాజీమంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పట్లోళ్ల సబిత ఇంద్రారెడ్డి సమక్షంలో శాలువాతో సత్కరించి స్వాగతం తెలియజేసిన మీర్ పేట్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిద్దాల బీరప్ప, బీఆర్ఎస్ రాష్ట్ర సెక్రటరీ షేర్ రమణ్, యువ నాయకులు మాచర్ల అవినాశ్, కీసర పూర్ణచంద్ర రెడ్డి పాల్గొనడం జరిగింది **(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)**



## యస్.బి.ఐ.టి. లో అట్టహాసంగా ఆరోహన్ - 26

- ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థులు
- ముఖ్య అతిథిగా హాజరైన డి.ఆర్.డి.ఒ. డి.జి.యమ్. రామస్వామి

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం యస్.బి.ఐ.టి. అటానమస్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆరోహన్ - 2026 విద్యార్థుల కేరింతల నడుమ వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో 40 కి పైగా ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించి వాటి పనితీరు గురించి పూర్తిగా వివరించారు. తొలుత ఆరోహన్ కార్యక్రమాన్ని డి.ఆర్.డి.ఒ. డి.జి.యమ్., భారత్ డైనమిక్స్ లిమిటెట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రామస్వామి సౌందర్యరాజన్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంబించారు. ఈ సందర్భంగా స్వాగత నృత్యంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో రామస్వామి మాట్లాడుతూ ప్రస్తుత కృతిమ మేధస్సు యుగంలో ఉద్యోగభద్రత, ఉద్యోగాలపై ఆందోళన ఉన్న నేపథ్యంలో కృతిమ మేధస్సుకు సరియైన సమాధానం మానవ మేధస్సే అని అన్నారు. మానవ మేధస్సును ఉపయోగించి నూతన ఆవిష్కరణలు చేస్తే విద్యార్థులకు ఉజ్వలభవిష్యత్తు ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రస్తుత యుగంలో డ్రోన్ టెక్నాలజీ బహుళప్రయోజనాలను సమకూరుస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ అంశంపై దృష్టి సారించి నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నూతన ఆవిష్కరణల కోసం ఇన్నోవేషన్ సెల్ ఏర్పాటు చేసామని తెలిపారు. విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే హ్యాకథాన్, ఐడియాథాన్ వంటి పోటీలలో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. దీనికంతటికీ రోజురోజుకి మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తాము శిక్షణను ఇవ్వడమే కారణమని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దావ జి. ధాత్రి మట్లాడుతూ విద్యార్థులు వారి సొంత ఆలోచనలతో భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే నూతన ఆలోచనలతో ఆరోహన్ 2026 సందర్భంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పోలను ప్రదర్శించటం కళాశాలకు గర్వకారణమన్నారు. వైస్‌ఛైర్మన్ కె. శ్రీచైతన్య మాట్లాడుతూ రోబోటెక్నాలజీలో ఈ ఆరోహన్ ప్రారంభ ఉత్సవాలు నిర్వహించడం కళాశాలకు ఉన్న సాంకేతిక సత్తాను తెలియచేస్తుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ దావ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోహన్ 2026 టెక్నికల్ ఫెస్ట్




సందర్భంగా ఇతర కళాశాలల నుండి సుమారు 70 మంది విద్యార్థులు పాల్గొని పోటీతత్వాన్ని చాటారన్నారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధాన చేసారని ఆయన వెల్లడించారు. ఆకట్టుకున్న ప్రాజెక్ట్ ఎక్స్‌పో: ఆరోహన్ 2026 టెక్నికల్ ఎక్స్‌పో సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 40 ప్రాజెక్టులు అతిథులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థుల వివరణలో ప్రారంభం నుంచి ఏవిధమైన టెక్నికల్ విధానాన్ని అవలంబించారో వంటి వివరాలు అతిథులు తెలుసుకొని వారిని అభినందించారు. అనంతరం వివిధ ఇంజనీరింగ్ విభాగాలలో జరిగిన సాంకేతిక పోటీలైన కోడ్ డిబగ్గింగ్, సర్క్యూటిక్స్, క్విజ్, యంగ్ మేనేజర్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:**

ఖమ్మం, యస్.బి.ఐ.టి. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఆరోహన్ టెక్నికల్ ఫెస్ట్ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఆటపాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా క్లాసికల్ వెస్టన్, బ్రేక్ తదితర నృత్యాలు ప్రదర్శించి చూపరులను మైమరిపంచేసారు. అదేవిధంగా గ్రూప్ డ్యాన్స్‌లతో కూడా విద్యార్థులను హోరెత్తించారు. మొత్తం మీద ఆరోహన్ 2026 కార్యక్రమం విద్యార్థుల కేరింతల నడుమ వారికి ఆనందాన్ని ఇస్తూ ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్ గంధం శ్రీనివాసరావు, దావ ఎ.వి.వి. శివ ప్రసాద్ వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పోరాట ఫలితంగానే అవినీతి అధికారుల సస్పెన్షన్

- నాటి బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల ఒత్తిడితోనే భారీ కుంభకోణాలు
- అధికారులు నోరు విప్పితే అసలు నేరస్తులు బయటపడతారు - బిజెపి అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని బడంగ్‌పేట్ బీజేపీ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆరోపించారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, సుమారు 120 కోట్లకు పైగా ప్రజా ధనం దుర్వినియోగమైందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్నప్పటి నుండి జీహెచ్ఎంసీ లో విలీనమైన తర్వాత వరకు నిధుల వినియోగంపై అనేక సార్లు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరినప్పటికీ, అధికారులు సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను సాకుగా చూపుతూ సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేశారని విమర్శించారు. అధికారుల వ్యవహారంపై అనుమానం రావడంతో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారి ప్రాథమిక సోదాల్లో వందల కోట్ల అవినీతి జరిగినట్లు బయటపడిందని తెలిపారు. ఈ కేసులో అప్పటి కమిషనర్, ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ సరస్వతి సహా పలువురు అధికారుల సస్పెన్షన్ తమ ఆరోపణలకు బలం చేకూర్చిందన్నారు. ఈ అవినీతి కేవలం అధికారులకే పరిమితం కాలేదని, దీని వెనుక బడంగ్పేట్ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన బడా నాయకుల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి పాత్రపై కూడా సందేహాలు ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. సస్పెండ్ అయిన అధికారులు నోరు విప్పి ఈ స్కామ్ వెనుక ఉన్న అసలైన దోషులు, రాజకీయ నాయకుల పేర్లను బయటపెట్టాలి. అప్పుడే ప్రజల సొమ్ముకు న్యాయం జరుగుతుందని రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నడికూడీ యాదగిరి, రేసు నరసింహారెడ్డి, ఫోర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కొంతం ప్రకాష్ రెడ్డి, కొంతం మురళీధర్ రెడ్డి, అగ్గిసెట్టి సైదులు, క్యారగారి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీల అమలు కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీయండి

బుర్రి ప్రసాద్ పిలుపు




**భువనగిరి, ఏప్రిల్ 03(క్రైమ్ మిర్రర్):** భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇస్తానన్న 12 వేల రూపాయల కోసం, మహిళలకు నెల నెల 2500 రూపాయల కోసం, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఎమ్మెల్యేలను, మంత్రులను, కాంగ్రెస్ నాయకులను గ్రామ గ్రామాన ప్రజలు, వ్యవసాయ కూలీలు నిలదీయాలని, ప్రశ్నించాలని అఖిల భారతీయుల వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్క్ షాప్ జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేసి కేరళ రాష్ట్రంలో కూడా ప్రజలను కాంగ్రెస్ తరపున మోసం చేయడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రికి రాష్ట్రంలో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ఇతర రాష్ట్రాల్లో తప్పుడు ప్రచారం చేయకుండా తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రసాద్ ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పెళ్లయిన ఆడపిల్లలకు తులం బంగారం మంటివి, దళితులకు అంబేద్కర్ పథకం మంటివి, పెన్షన్లు పెంచుతా నంటివి, నిరుద్యోగ భృతి అంటివి ఏ ఒక్క హామీ అన్న అమలు చేసావా అని ప్రశ్నించారు. అమలు చేయకుండా తప్పుడు ప్రచారం చేస్తే ముఖ్యమంత్రి స్థాయికి తగునా అని అన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను మాట్లాడి నీవు చేసిన వాగ్దానాలను అమలు చేయాలని సూచించారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి జహంగీర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు నేటికీ పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వలేదని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఏడు ఎనిమిది మండలాలలో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం ఎత్తివేసి పేదలకు సాగుభూమి, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘం ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, రాష్ట్ర కమిటీ సభ్యులు జెల్లల పెంటయ్య, గంగాదేవి సైదులు, రాచకొండ రాములమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, జూకంటి పౌల్, జిల్లా సహాయ కార్యదర్శులు సిరిపంగి స్వామి, గుంటోజీ శ్రీనివాస్ చారి, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, బొడ్డు కిషన్, కొండపురం యాదగిరి, మానే సాలయ్య, బొల్లెపల్లి కిషన్, పద్మ, బాలరాజు, ముకుంద, హనుమంతు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం అభినందనీయం

జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తిరుమలాయపాలెం మండలంలోని పలు ఉన్నత పాఠశాలలో జిల్లా అకాడమిక్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు మండల పరిధిలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలు, జల్లేపల్లి పాఠశాలలను ఆయన సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులతో విజయం సాధించాలని అన్నారు.

# ఖమ్మం ప్రెస్ క్లబ్ వార్షిక శ్వేత పత్రం విడుదల

హర్షం వ్యక్తం చేసిన జర్నలిస్టులు




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం ప్రెస్ క్లబ్ పాలకమండలి వార్షిక ఆదాయ, వ్యయాల శ్వేత పత్రాన్ని విడుదల చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వార్షిక ఆదాయ వ్యయాలను టి యు డబ్ల్యు జే (టి జె ఎఫ్) ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, టి యు డబ్ల్యు జే (ఐజేయు) అధ్యక్షులు నామ పురుషోత్తం లు వెల్లడించారు. ఏప్రిల్ 2025 నుంచి మార్చి 2026 వరకు ఈ 12 నెలల కాలంలో 74 ప్రెస్ మీట్ల కు గాను 1,06,500 ఆదాయం లభించిందని, వీటిలో వర్కర్ జీతం,కరెంటు బిల్లు, వాటర్ బిల్లు,మైక్ సెట్ ల కొనుగోలు, విద్యుత్ పరికరాల కొనుగోలు, ప్రెస్ క్లబ్ కు అవసరమైన స్టేషనరీ తదితర కొనుగోళ్లకు రూ.75,756 రూపాయలు ఖర్చు అయినట్లు తెలిపారు. వీటిల్లో ఈ ఏడాది రూ.30,744 రూపాయలు మిగులు బడ్జెట్ గా లభించిందని ప్రకటించారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ప్రతి జర్నలిస్ట్ తమ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీలు వార్షిక ఆదాయ,వ్యయాల శ్వేత పత్రాన్ని విడుదల చేయటం పట్ల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యు జే (ఐ జే యు) ప్రెస్ క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్, టి యు డబ్ల్యు జే (టిజేఎఫ్) ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పి. పానకాలరావు,రేపాక యాదగిరి,పులి శ్రీను,ప్రచార కార్యదర్శి కూరపాటి నరేష్, కమిటీ సభ్యులు మురళి, ఉల్లోజు రమేష్,ఇసంపల్లి వెంకటేశ్వర్లు,శంకర్,ఐజేయు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధిస్తాం

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బాలాపూర్ మండలం జిల్లెలగూడలో తెలంగాణ సాయుధ రైతాంగా పోరాట అమరవీరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా అయన ఆశయాలను సాధించాలని కొమురయ్య విగ్రహానికి పూల మాలలు వేసి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు దాసరి బాబు, శేఖర్ యాదవ్ మాట్లాడుతూ రజాకార్లకు వ్యతిరేకంగా పెత్తందారులకు వ్యతిరేకంగా దొరలకు వ్యతిరేకంగా భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగా పోరాట యోధుడు తెలంగాణలో దున్నేవారికి భూమి కావాలని రజాకారులను ఎదిరించి తూటాలకు బలి అయి అమరుడైన దొడ్డి కొమురయ్య ఆశయాలు సాధించాలని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రఘు, రామ్ కుమార్, లింగం, లక్ష్మారెడ్డి, వెంకట్ రెడ్డి, శివ తదితరులు నివాళులర్పించారు.



# ఫీజు బకాయిలపై హైకోర్టు తీర్పు సరికాదు పేద విద్యార్థులు చదువులకు తీవ్ర నష్టం

ఏ ఐ ఎఫ్ డి ఎస్ రాష్ట్ర ప్రధాన రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి..



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏ ఐ ఎఫ్ డి ఎస్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి ప్రకటన విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా పల్లె మురళి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఫీజు బకాయిలపై ఇచ్చిన తీర్పులో విద్యార్థుల నుండి వసూలు చేసుకుని ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తిరిగి విద్యార్థులకు చెల్లించాలని తీర్పు సరైనది కాదని ఇది విద్యార్థుల చదువుల అభివృద్ధికి గొడ్డలిపెట్టని హైకోర్టు తీర్పును పున:సమీక్ష చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏ ఐ ఎఫ్ డి ఎస్) తెలంగాణ రాష్ట్ర కమిటీ కోరుతున్నది ప్రైవేటు కళాశాలలు ప్రభుత్వం ప్రకటించిన ఫీజు పథకం అమలు చేస్తామని అంగీకారాన్ని తెలిపి విద్యార్థులను చేర్చుకున్నారని అలాంటిది ప్రైవేటు యజమాన్యాల బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వకుండా విద్యార్థుల నుండి వసూలు చేసుకోండి అనే తీర్పు సరైనది కాదు అ అణగారిన వర్గాల నుండి ఇప్పుడే ఉన్నత విద్యలోకి వస్తున్న ప్రధానంగా ఈ ఫీజులు పొందే వారు పేద విద్యార్థులు వారిలో రాష్ట్రంలో 14 లక్షల మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులే ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారని వారు ఈ తీర్పు వలన మరింత ఇబ్బందులకు గురి అవుతారని ఇప్పటికే రాష్ట్రంలో ప్రైవేటు యజమాన్యాలు ఫీజు బకాయిలు రావడంలేదని పేద విద్యార్థుల సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని దీనివల్ల గతంలో విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని వారు అన్నారు ప్రభుత్వం తక్షణమే రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్నిఏ ఐ ఎఫ్ డి ఎస్ డిమాండ్ చేస్తుంది. హైకోర్టు తీర్పును పున: సమీక్షించి ప్రభుత్వానికి తక్షణమే ఫీజు విడుదల కోసం ఆదేశాలు ఇవ్వాలని కోరుతుంది.